క్లుప్తంగా

మంచినీటి ట్యాంకుల్లో క్లోరినేషన్



పొదలకూరు : పట్టణంలోని మంచినీటి ట్యాంకుల్లో పంచాయతీ కార్యదర్శి దొరబాబు పర్యవేక్షణలో శనివారం క్లోరినేషన్ చేపట్టారు. జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు ప్రజలు కలుషిత నీటిని తాగకుండా స్పెషల్ డ్రైవ్ ద్వారా టైలర్స్‌కాలనీ, గుర్రాపు బావి, ఎమ్మార్వో కాలనీ తదితర ప్రాంతాల్లోని ట్యాంకులు, సంపుల్లో క్లోరినేషన్ చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది కూడా పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రతపై అవగాహన



కొడవలూరు: మండలంలోని బొడ్డువారిపాలెంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలికలకు వ్యక్తిగత శుభ్రతపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టీ నాగభూషణమ్మ మాట్లాడుతూ రుతుక్రమంపై ఉన్న అపోహలు, ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం బాలికలకు రుతుక్రమ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేస్తూ ముద్రించిన కరపత్రాలను అందజేశారు. అంగన్‌వాడీ హెల్పర్ వెన్నెల, తల్లులు, బాలికలు పాల్గొన్నారు.

వెంకయ్యస్వామికి విశేష పూజలు



మనుబోలు: మనుబోలు–చెర్లోపల్లి రోడ్డులోని భగవాన్ వెంకయ్యస్వామి మందిరంలో శనివారం పంచామృతాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. వెంకయ్యస్వామి విశేషాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. హోమగుండం వద్ద ధుని పూజ నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి పితృవియోగం



మనుబోలు: మండలంలోని యాచవరం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఒలిపి శ్రీనివాసులు తండ్రి ఒలిపి రమణయ్య శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. వైఎస్సార్ సీపీ మండల నాయకులు బొమ్మిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్ తదితరులు రమణయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. శ్రీనివాసులు కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

భక్తిశ్రద్ధలతో పల్లకిసేవ

పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లోని శ్రీలక్ష్మీగోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకిసేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీవారు విశేషాలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు.

గజ వాహనంపై కాశీవిశ్వనాథుడు



నెల్లూరు(బృందావనం): ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని అన్నపూర్ణ, విశాలాక్షి సమేత కాశీవిశ్వనాథస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శనివారం రాత్రి స్వామివారు గజ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు వందవాసి విశ్వనాథగురుకుల్, వందవాసి గణేష్ గురుకుల్ ఆధ్వర్యంలో దేవదేవేరులకు విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థవాది, త్రిశూలస్నానం, సాయంత్రం ధ్వజావరోహణం నిర్వహించారు.ఉభయకర్తలుగా పాల్వాడి మణికంఠ, వినీల దంపతులు వ్యవహరించారు. కాగా ఆదివారం రాత్రి 8గంటలకు ఏకాంతసేవతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమవుతాయని ఈఓ దర్గయ్య తెలిపారు.

పచ్చిరొట్ట.. భూమికి రక్ష



సాగులో ఉన్న జీలుగ



రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు అందజేస్తున్న ఏఓ లక్ష్మి

- భూసార పరిరక్షణపై రైతుల్లో పెరిగిన చైతన్యం
- దిగుబడుల పెంపునకు పచ్చిరొట్ట సాగుపై ప్రత్యేక దృష్టి
- రాయితీపై విత్తనాల పంపిణీతో ప్రభుత్వం ప్రోత్సాహం
- డెల్టాలో యాభై శాతం విస్తీర్ణంలో సాగుకు ఏర్పాట్లు

కొడవలూరు: ఆధునిక వ్యవసాయం రైతన్నలకు లాభాలు తెచ్చినా భూమి తల్లికి మాత్రం తీరని నష్టాన్ని కలిగిస్తోంది. సంప్రదాయ సాగుతో భూసారం క్రమంగా తగ్గిపోతోంది. అధిక దిగుబడులే లక్ష్యంగా రసాయన ఎరువుల వాడకం నేల స్థితిగతులనే మారుస్తోంది. నేలల్లో చౌడు శాతాన్ని పెంచడంతో పాటు సహజ లక్షణాలను దెబ్బతీస్తోంది. వీటి వాడకాన్ని తగ్గించుకోకుంటే భవిష్యత్‌లో భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. అందుకే ప్రభుత్వం భూసారాన్ని పరిరక్షించడంపై దృష్టి సారించింది. రైతులకు పచ్చిరొట్ట సాగు ఆవశ్యకతపై అవగాహన సదస్సులు నిర్వహించడంతో పాటు సబ్సిడీపై విత్తనాలు అందజేస్తూ ప్రోత్సహిస్తోంది. దీంతో భూసార పరిరక్షణపై రైతుల్లోనూ చైతన్యం పెరిగింది. పచ్చిరొట్ట సాగుతో భూసారాన్ని పరిరక్షించుకోవడంపై దృష్టి సారిస్తున్నారు. ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న పచ్చిరొట్ట విత్తనాలను సద్వినియోగం చేసుకుని భూసారాన్ని పెంపొందించుకునేందుకు సమాయత్తమయ్యారు. తద్వారా దిగుబడులు గణనీయంగా పెంచుకోవడమే లక్ష్యంగా సాగుతున్నారు.డెల్టా మండలాలైన సంగం, బుచ్చిరెడ్డిపాళెం, కోవూరు, కొడవలూరు, విడవలూరు, అల్లూరు, దగదర్తి, ఇందుకూరుపేట మండలాల్లో సాగునీటి విడుదల జరిగితే అధికారికంగా లక్షా డెబ్బై వేల ఎకరాలు, అనధికారికంగా మరో 30 వేల ఎకరాలు కలిపి రెండు లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఎడగారుకు సాగునీటి విడుదల జరగలేదు. దీంతో బోర్ల సదుపాయమున్న పది నుంచి పదిహేను శాతం మంది రైతులే వరి సాగు చేస్తున్నారు. మరో పది శాతం మంది రైతులు ఆరు తడి పంటలను సాగు చేస్తున్నారు. సుమారు యాభై శాతం మంది రైతులు అంటే సుమారు లక్ష ఎకరాల్లో పచ్చిరొట్ట పంట సాగు చేసి నేలను సారవంతం చేసుకునేందుకు సిద్ధమయ్యారు.

పచ్చిరొట్టతో ప్రయోజనాలివే..

నేలను సత్తువ చేసుకోకుండా వరి సాగు చేసుకుంటూ పోవడం వల్ల భూమి నిస్సారమై దిగుబడులు గణనీయంగా తగ్గుతున్నాయి. రసాయన ఎరువులను విరివిగా వాడాల్సి రావడంతో వాటి ఖర్చు గణనీయంగా పెరుగుతోంది. పచ్చిరొట్ట పంట సాగు చేయడం వల్ల నేలను సారవంతం చేసుకోవచ్చు. తద్వారా దిగబడులను గణనీయంగా పెంచుకోవడంతో పాటు రసాయన ఎరువులను బాగా తగ్గించుకోవచ్చు. తద్వారా ఎరువుల ఖర్చు బాగా తగ్గుతుంది. అందుకే పంట విరామ సమయాన్ని రైతులు సద్వినియోగం చేసుకుంటున్నారు. ఖరీఫ్ సాగుకు నీటి విడుదల లేకపోవడంతో నేలను ఖాళీగా వదిలేయడం కంటే సత్తువ చేసుకోవడం ద్వారా మేలు జరుగుతుందని రైతులు భావిస్తున్నారు. అందువల్లే ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న పచ్చిరొట్ట విత్తనాలను సద్వినియోగం చేసుకుంటున్నారు. వీటి సాగుకు ఒక తడి అవసరం కావడంతో అరకొరగా బోర్ల సదుపాయం ఉన్న రైతులు విత్తనాలు చల్లుకోవడం ఆరంభించారు. మిగిలిన రైతులు రాయితీ విత్తనాలను పొంది జూన్‌లో రుతు పవనాల కారణంగా పడే తొలకరి జల్లుల కోసం వేచి చూస్తున్నారు. పచ్చిరొట్ట పంట సాగుకు రెండు నెలల వ్యవధి అవసరం. విత్తనాలు చల్లాక 45 రోజులకు పూత దశకు వస్తుంది. ఆ సమయంలో పొలంలో పంటను కలియ దున్ని 15 రోజులపాటు మురగపెట్టాలి. అప్పుడే భూమిలోని లవణాలుపైకి చేరి నేల సారవంతం అవుతుంది.

ప్రభుత్వ ప్రోత్సాహం

రైతులు నేలను సారవంతం చేసకుంనేందుకు ప్రభుత్వం ప్రోత్సాహాన్ని అందిస్తోంది. పచ్చిరొట్ట విత్తనాలైన పిల్లి పెసర, జీలుగ, జనుములను యాభై శాతం రాయితీతో రైతులకు అందిస్తోంది. జీలుగలు, జనుములు పది కిలోల సంచి రూ.880 కాగా, రాయితీపై రూ.440లకే అందిస్తోంది. పిల్లి పెసర్లు పది కిలోలు రూ.1340 కాగా, రూ.670లకే అందిస్తోంది.

దిగుబడి పెంపునకు దోహదం



పచ్చిరొట్ట సాగు ద్వారా నేల సారవంతమవుతుంది. తద్వారా దిగుబడులు పెంచుకోవచ్చు. రసాయన ఎరువుల ఖర్చు బాగా తగ్గుతుంది. దిగుబడులు తగ్గుతున్న ప్రస్తుత తరుణంలో నేలను సారవంతం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అందువల్లే నాకున్న ఐదెకరాల్లో పిల్లిపెసర సాగు చేస్తున్నాను.

– డీ మురళిమోహన్‌రావు, రైతు, గుండాలమ్మపాళెం

నేల నిస్సారమైతే నష్టపోవాల్సిందే



నేలను పట్టించుకోకుండా పంటసాగు చేసుకుంటూ పోతే నేల నిస్సారమై రసాయన ఎరువులు ఎంతగా వాడినా దిగుబడులు పెరగవు. దీంతో సాగు ఖర్చు గణనీయంగా పెరిగి రైతు నష్టపోవాల్సి ఉంటుంది. గతంలో అలా నష్టపోవడంతో మేల్కొని గత కొంత కాలంగా రెండు పంటలకు మధ్య వ్యవధిలో పచ్చిరొట్ట సాగు చేస్తున్నాను. ఎరువుల ఖర్చు తగ్గడంతో పాటు దిగుబడులు ఆశాజనకంగా ఉంటున్నాయి.

– కే సుబ్బరామిరెడ్డి, రైతు, మానేగుంటపాడు

రైతుల్లో చైతన్యానికి కృషి



పచ్చిరొట్ట సాగు ఆవశ్యకతపై రైతుల్లో చైతన్యం తెచ్చేందుకు వ్యవసాయ శాఖ ఎంతగానో కృషి చేస్తోంది. భూసార పరిరక్షణపై అవగాహన సదస్సులు నిర్వహించడంతో పాటు రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను అందజేస్తుండంతో నేలను సారవంతం చేసుకునే రైతుల సంఖ్య గణనీయంగా పెరిగింది. పచ్చిరొట్ట సాగుతో మంచి ఫలితాలు ఉంటుండడంతో ఏటా సాగుచేసే రైతుల సంఖ్య పెరుగుతోంది.

– లక్ష్మి, ఏఓ, కొడవలూరు

లోతైన దుక్కులతో తెగుళ్లు దూరం

- జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి సత్యవాణి

కొడవలూరు: వేసవిలో లోతైన దుక్కులు దున్నుకోవడం వల్ల మట్టి ద్వారా సంక్రమించే తెగుళ్లను నివారించుకోవచ్చని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి పీ సత్యవాణి తెలిపారు. మండలంలోని కమ్మపాళెం, రేగడిచెలిక గ్రామాల్లో భూసార పరిరక్షణపై రైతులకు శనివారం అవగాహన సదస్సులు నిర్వహించారు. కమ్మపాళెంలో జరిగిన సదస్సులో సత్యవాణి పాల్గొని మాట్లాడారు. రసాయన ఎరువులను విచ్చలవిడిగా వినియోగించడం వల్ల భూమి స్వరూపం క్రమంగా దెబ్బతింటుందని తెలిపారు. వాటికి బదులుగా జీవన ఎరువులను వినియోగించడం ప్రయోజనకరమని చెప్పారు. ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా యాభై శాతం రాయితీపై అందజేస్తున్న పచ్చిరొట్ట విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎడగారు పంట విరామ సమయంలో పచ్చిరొట్ట పైర్లు సాగు చేసుకుని భూమిని సారవంతం చేసుకోవాలని సూచించారు. ఏడీఏ నర్సోజీ మాట్లాడుతూ నానో యూరియా, నానో డీఏపీల ప్రయోజనాలను రైతులకు వివరించారు. అనంతరం రైతులకు రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేశారు. ఏడీఏ డీ సుజాత, ఏఓ లక్ష్మి, ఏఈఓ అనూష, వీఏఏలు సుజిత్, నవీన్, రైతులు పాల్గొన్నారు.



పచ్చిరొట్ట విత్తనాలను అందజేస్తున్న సత్యవాణి

వైభవంగా పోలేరమ్మ గ్రామోత్సవం

విడవలూరు: మండలంలోని వడ్డిపాళెంలోని గామ దేవత పోలేరమ్మ ఆలయం రెండో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వారం రోజులుగా వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శనివారం ఆలయ అర్చకులు పాశం కృష్ణ ఆధ్వర్యంలో పోలేరమ్మను విశేషంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో గ్రామోత్సవంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అమ్మవారి చీరల వేలం పాట నిర్వహించారు. అమ్మవారి చీరలను దక్కించుకునేందుకు భక్తులు పోటీపడ్డారు.



విశేషాలంకారంలో పోలేరమ్మ

భూసార పరిరక్షణపై అవగాహన

ఇందుకూరుపేట: రసాయన ఎరువుల అధిక వినియోగంతో నేల తన స్వభావాన్ని కోల్పోతుందని, బయోఎరువులు, సేంద్రియ ఎరువులను వినియోగించి సమతుల్యత పాటించాలని మండల వ్యవసాయశాఖ అధికారి రఘునాథ్‌రెడ్డి రైతులకు సూచించారు. మండలంలోని మైపాడులో భూసార పరిరక్షణపై శనివారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మట్లాడుతూ రైతులు భూసార పరీక్షలు చేయించుకుని నివేదిక ఆధారంగా సూచించిన మోతాదు మేరకే పంటకు ఎరువులను వినియోగించాలని సూచించారు. జీలుగ, పిల్లిపెసర, జనుము వంటి పచ్చిరొట్ట పైర్ల సాగుద్వారా భూమి సారవంతంగా తయారవుతుందని తెలిపారు. తద్వారా రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించుకోవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ నరహరి, రైతులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఏఓ రఘునాథరెడ్డి

ఘనంగా అన్నమయ్య జయంతి ఉత్సవం



నెల్లూరు(బృందావనం): మాగుంటలేఅవుట్‌లోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల 616వ జయంతి ఉత్సవాన్ని శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. శ్రీగురుకృప, భారతి సంగీత విద్యాలయాలకు చెందిన 150 మంది విద్యార్థులు అన్నమయ్య సంకీర్తనలతో సంగీత విభావరిని వీనుల విందుగా నిర్వహించారు. తొలుత ఆయా విద్యాలయాల నిర్వాహకులు, గురువులు లక్ష్మీప్రసన్న, ఎ.రమాదేవి ఆధ్వర్యంలో విద్యార్థులు నగర సంకీర్తన చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: మోటార్‌సైకిల్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని కాకుటూరు సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం చోటు చేసుకుంది. వివరాలు..గూడూరుకు చెందిన పెంచలప్రసాద్ మోటారుసైకిల్‌పై నెల్లూరుకు వెళ్లాడు. అక్కడ పని ముగించుకుని తిరిగి గూడూరుకు వెళ్లే క్రమంలో కాకుటూరు సమీపంలో జాతీయ రహదారిని దాటుతున్న వ్యక్తిని తప్పించబోయి అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో పెంచలప్రసాద్‌కు గాయాలవ్వగా చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పరస్పరం దాడులపై కేసుల నమోదు

పొదలకూరు : మండలంలోని విరువూరుకు చెందిన సమీప బంధువులు శనివారం పరస్పరం దాడులకు పాల్పడి ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకోవడంతో పోలీసులు కేసులు నమోదు చేశారు. వివరాలు.. గ్రామానికి చెందిన సాయి, బాలకృష్ణ బంధువులు. ఇరువురి ఇళ్లు పక్కపక్కనే ఉంటాయి. వారు తరచూ ఏదోక విషయమై గొడవలు పడేవారు. ఈ క్రమంలో శనివారం పరస్పరం దాడులు చేసుకుని ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదులు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన విశ్వేశ్వరుని బ్రహ్మోత్సవాలు

ఇందుకూరుపేట: మండలంలోని మైపాడులో కొలువైయున్న అన్నపూర్ణాంబ సమేత ప్రసన్న విశ్వేశ్వరస్వామి ఆలయంలో తొమ్మిది రోజులుగా జరుగుతున్న బ్రహ్మోత్సవాలు శనివారం రాత్రితో ముగిశాయి. చివరి రోజు ఆలయ అర్చకులు బండారు ప్రభాకర్‌శర్మ ఆధ్వర్యంలో ఆదిదంపతులను పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి గంధవడి ఉత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. రాత్రి ఆదిదంపతులకు ఏకాంత సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉభయకర్తలుగా వల్లూరు కృష్ణయ్య. అన్నపూర్ణమ్మ దంపతులు వ్యవహరించారు.

రంగనాథుడి సేవలో సుప్రీంకోర్టు జడ్జి



నెల్లూరు(బృందావనం): రంగనాయకులపేటలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామిని సుప్రీంకోర్టు జడ్జి సీటీ రవికుమార్ దంపతులు శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత జడ్జి దంపతులకు దేవస్థానం ఆధ్వర్యంలో సంప్రదాయంగా పూర్ణకుంభంతో ఆహ్వానం పలికారు. అనంతరం వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు అందజేశారు. స్వామివారి చిత్రపటం తీర్థప్రసాదాలు అందజేశారు. జిల్లా దేవాదాయ శాఖ అధికారి జే శ్రీనివాసరావు, ఈఓ అర్చభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు

విడవలూరు: సేంద్రియ విధానంలో వ్యవసాయ చేయడం ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారిణి సత్యవాణి, ఏడీఏ నర్సోజీ తెలిపారు. స్థానిక రైతుభరోసా కేంద్రంలో భూసార పరిరక్షణపై రైతులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు జీవనఎరువులు, సేంద్రియ వ్యవసాయం, నానో యూరియా, నానో డీఏపీలపై అవగాహన కల్పించారు. పచ్చిరొట్ట సాగుతో భూమి సారవంతంగా తయారవుతుందని తెలిపారు. ప్రభుత్వం రాయితీపై అందజేస్తున్న పచ్చిరొట్ట విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం రైతులకు రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఓ వెంకటకృష్ణయ్య పాల్గొన్నారు.



రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు అందజేస్తున్న వ్యవసాయాధికారులు

జొన్నవాడ ఆలయ భూమి ఆక్రమణపై పరిశీలన

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి ఆలయానికి చెందిన భూమి ఆక్రమణపై తహసీల్దార్ సురేష్‌బాబు, ఈఓ గిరికృష్ణ శనివారం పరిశీలించారు. కామాక్షితాయి ఆలయానికి చెందిన 0.90 సెంట్ల భూమిని కొందరు ఆక్రమించడంపై గ్రామస్తులు శుక్రవారం నెల్లూరు ఆర్డీఓ మలోలకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు తహసీల్దార్, ఈఓ సదరు ఆక్రమిత భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ ఆక్రమిత భూమి 50 ఏళ్లుగా దేవస్థానానికి సంబంధించిన పూలతోటగా వినియోగిస్తున్నట్లు ఆలయ రికార్డుల్లో ఉందన్నారు. స్థలానికి సంబంధించి ప్రాపర్టీ రిజిష్టర్ నకలును తహసీల్దార్‌కు అందజేశామని తెలిపారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఆర్డీఓ ఆదేశాల మేరకు ఆలయ భూమి ఆక్రమణపై పరిశీలించామని, నివేదికను ఆర్డీఓకు అందజేస్తామని తెలిపారు.

ప్రపంచానికి ఆదర్శం హిందూధర్మం

నెల్లూరు(బృందావనం): హిందూధర్మం ప్రపంచానికి ఆదర్శమని ఆధ్యాత్మిక ప్రసంగీకులు బత్తిన సాయికుమార్‌రెడ్డి పేర్కొన్నారు.పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్లో సృజన సాహిత్య, సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు దగ్గుపాటి రాధాకృష్ణ ఆధ్వర్యంలో హైందవధర్మ జాగృత సదస్సును శనివారం రాత్రి నిర్వహించారు. ఈ సదస్సుకు సాయికుమార్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. శతాబ్దాలపాటు ఎన్నో ప్రతిబంధకాలు ఎదురైనప్పటికీ ఎటువంటి ఒడిదుడుకులకు లోనుకాకుండా వేలాది సంవత్సరాలుగా హిందూ ధర్మం మనుగడ సాగిస్తోందన్నారు. ప్రపంచంలో ఏ ధర్మానికి లేని గొప్పతనం హైందవ ధర్మానికి ఉందన్నారు. అటువంటి హైందవ ధర్మాన్ని వ్యతిరేక శక్తుల నుంచి కాపాడుకోవాల్సిన బాధ్యత హిందువులపై ఉందన్నారు. అనంతరం సామాజిక సమరసత ఫౌండేషన్ రాష్ట్ర కన్వీనర్ కోడూరు జయప్రద, సంఘ సేవకులు పెనాక సుజాతరెడ్డి, కవయిత్రి నాగేశ్వరమ్మ, డాక్టర్ మారం సుధాకర్, సింగంశెట్టి మురళీమోహన్‌రావు, పీ పవన్‌కుమార్‌శర్మ, అడ్వొకేట్ కాకు మురళీరెడ్డి, తదితరులు ప్రసంగించారు. హిందూధర్మ విశిష్టతను వివరించారు. ఈ సందర్భంగా వర్ధమాన గాయకులు ఆలపించిన భక్తిగీతాలు అలరించాయి. ఔత్సాహిక గాయకులకు ప్రోత్సాహకంగా బహుమతులు అందజేశారు.



ప్రసంగిస్తున్న బత్తిన సాయికుమార్‌రెడ్డి

ఏపీ హంస జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక



నెల్లూరు(బృందావనం): ఏపీ హంస జిల్లా నూతన అధ్యక్షుడిగా చేజర్ల సుధాకర్‌రావు ఎన్నికయ్యారు. ఏపీ హంస జిల్లా సర్వసభ్య సమావేశాన్ని పురమందిరం ప్రాంగణంలోని ఏసీహాల్‌లో శనివారం రాత్రి నిర్వహించారు. ఏపీ హంస రాష్ట్రాధ్యక్షుడు అరవపాల్ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా బీ కమల్‌కిరణ్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా కప్పా నారాయణరాజు, కోశాధికారిగా ఎస్‌డీ మజహర్, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎస్కే జలీల్ అహ్మద్, పబ్లిసిటీ సెక్రటరీగా ఎస్ శేషగిరిరావు, ఉపాధ్యక్షులుగా వీ మురళీకృష్ణ, కే సహన, బీ నాగరాజమ్మ, టీ రాజయ్య, సీ నాగరాజును ఎన్నుకున్నారు. మహిళా కార్యదర్శిగా బీ సుకన్య, జాయింట్‌సెక్రటరీలుగా సీహెచ్ హరిప్రసాద్, టీవీ ఉషారాణి, కేవీ మహేష్‌బాబు, జీ ఉమామహేశ్వర్, చాముండేశ్వరి ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షుడిగా వై వెంకటేశ్వర్లు, మహిళా విభాగం గౌరవాధ్యక్షురాలిగా ఆర్ ఇందిర, గౌరవ సలహాదారులుగా ఏ పరిమళ, విజయమ్మ, ప్రపుల్లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రాధ్యక్షుడు అరవ పాల్ మాట్లాడుతూ నూతన కార్యవర్గం సంఘటితంగా ఉద్యోగులు హక్కుల సాధనతో పాటు సంఘ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.